

మిర్చితోటలో ఎన్నికల ప్రచారం

## అటవీగ్రామాల్లో బీఆర్ఎస్ ప్రచారం

చర్ల, నవంబర్ 20 : భద్రాచలం నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ తెల్లం వెంకట్రావును గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. సోమవారం మారుమూల గ్రామాల్లో ఇంటింటి ప్రచారంలో యువకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ మహిళా కార్యకర్తలు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ప్రచారం నిర్వహించారు. మహిళా నాయకురాలు సోయం క్రిష్ణవేణి కార్యకర్తలతో కలిసి మిర్చితోటలు, వరిచేల్లో పనిచేస్తున్న కూలీలను కలిసి ఓటు అభ్యర్థించారు. కారు గుర్తుకు ఓటేసి వెంకట్రావును గెలిపించాలని కోరారు. మండల కేంద్రంలో సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, చింతా నాగుబాబు, దొడ్డి తాతారావు, కాకి అనిల్, ఈశ్వర్, దొడ్డి సూరిబాబు, ఇరసవడ్ల రాము, కార్యకర్తలు పాల్గొన్నారు.



మారుమూల గ్రామాల్లో మహిళా కార్యకర్తల ప్రచారం

# గుర్తును గుర్తుంచుకో.. కారును గుర్తుంచుకో!

- ఇంటింటికీ తిరిగి ఓటు అభ్యర్థిస్తున్న కౌన్సిలర్లు
- ప్రతి పథకాన్ని వివరిస్తున్న ప్రజాప్రతినిధులు

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 20 : కొత్తగూడెం నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధి సాధించాలంటే బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని, ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు కారు గుర్తుకే ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కౌన్సిలర్లు పిలుపునిచ్చారు. సోమవారం కొత్తగూడెం పట్టణంలోని 36వ వార్డుల్లో కౌన్సిలర్లు 'గడప గడపకు వనమా' కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. 'మన గుర్తు కారు గుర్తు' అంటూ ప్రతి ఓటరుకు చెబుతూ ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కారు గుర్తుకే ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టోను యువకులు, వృద్ధులు, మహిళలకు స్పష్టంగా వివరించారు. రాష్ట్రం ఏర్పడ్డాక ఏయే రంగాల్లో ఎంత పురోగభివృద్ధి సాధించామో, అందులో కొత్తగూడెం నియోజకవర్గం ఏవిధంగా అభివృద్ధి చెందిందో, ఈ ప్రాంత ప్రజలకు జరిగిన ఉపయోగాలను వివరిస్తూ ఓటును అభ్యర్థించారు. కొత్తగూడెం ప్రాంతానికి వేల కోట్ల నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తున్నారని, ఈ అభివృద్ధి కొనసాగాలంటే వనమా వెంకటేశ్వరరావునే గెలిపించాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి పట్టణంలోని 6, 7, 15, 31, 35వ వార్డుల్లో పర్యటించి ప్రచారం చేశారు. వివిధ వార్డుల్లో వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్, కౌన్సిలర్లు మోరె రూప, అజ్మీరా సుజాత, కూరపాటి విజయలక్ష్మి, సాహేరా బేగం, అఫ్జలున్నీషా బేగం, వనచర్ల విమల, మాదా సత్యవతి, గుమ్మడెల్లి కళ్యాణి, మాచర్ల రాజకుమారి, బాలిశెట్టి సత్యభామ, బండి నర్సింహారావు, వేముల ప్రసాద్, యరమల శ్రీనివాసరెడ్డి, రుక్మాంగధర్ బండారి, అంబుల వేణుగోపాల్, కౌడగాని పరమేశ్, పాలోజు సత్యనారాయణచారి, పల్లపు లక్ష్మణ్, బోయిన విజయ్ కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అజ్మీరా పూర్ణ, పిడుగు శ్రీను, కోసున వాసు, ఎం.ఎ.రజాక్, కూరపాటి సుధాకర్, మహ్మద్ యూసుఫ్, సుందర్‌రాజు, గుమ్మడెల్లి దుర్గ, పిల్లి కుమార్, మాచర్ల శ్రీనివాస్, మాదా శ్రీరాములు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



6వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి



వార్డుల్లో తిరుగుతూ బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను చూపించి ఓటు అభ్యర్థిస్తున్న 25వ వార్డు కౌన్సిలర్ సాహేరాబేగం, మాజీ కౌన్సిలర్ యూసుఫ్



వృద్ధురాలికి మ్యానిఫెస్టోను వివరిస్తూ కారు గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న 9వ వార్డు కౌన్సిలర్ మోరె రూప

# రామయ్యకు ముత్తంగి అలంకరణ





రామయ్యకు నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు, గోట్లపాడులో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, నవంబర్ 20 : భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో సోమవారం అంతరాలయంలోని మూలవరులకు బెంగుళూరు భక్తులు రూ.30 లక్షలతో తయారు చేయించి సమర్పించిన ముత్యాలు పొదిగిన ప్రత్యేక తొడుగులను ధరింపజేశారు. ఈ ప్రత్యేక అలంకరణలో సీతారామ, లక్ష్మణమూర్తులు మరింత రమణీయంగా దర్శనమివ్వడంతో భక్తులు పరవశించిపోయారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య పూజలు, నిత్య హోమాలు, నిత్య బలిహరణం జరిపారు. స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి సంప్రదాయబద్ధంగా నిత్య కల్యాణం నిర్వహించి, కల్యాణంలో పాల్గొన్న దాతలకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

### సత్యనారాయణస్వామి వ్రతాలు ప్రారంభం

భద్రాచలం, నవంబర్ 20 : భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో సోమవారం సత్యనారాయణ స్వామి వ్రతాలను ప్రారంభించారు. కార్తీక మాసంలో ప్రతియేటా ఆనవాయితీలో భాగంగా ఈవో ఎల్.రమాదేవి ప్రారంభించారు. కార్తీకమాసంలో ప్రతి ఆది, సోమవారాలతోపాటు ఏకాదశి రోజుల్లో ఆలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో ఉదయం 8:30 నుంచి 10:30 గంటల వరకు వ్రతాలు నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. భక్తులు ఉదయం 8గంటల లోపు దేవస్థానం కౌంటర్‌లో రూ.516 టిక్కెట్లు తీసుకోవాలని పేర్కొన్నారు. వ్రతానికి కావాల్సిన పూజా సామగ్రి దేవస్థానం వారు అందజేస్తారని తెలిపారు.

### గోట్లపాడులో రామయ్య కల్యాణం

భద్రాచలం, నవంబర్ 20 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి జిల్లాలో పదిరోజుల పాటు జరిగే భద్రాద్రి రామయ్య కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం భీమవరం సమీపంలోని గోట్లపాడులో సీతారాముల కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవ మూర్తులను గ్రామంలో ఏర్పాటు చేసి ప్రత్యేక వేదికపై విశ్వక్సేన ఆరాధన, కర్మణః పుణ్యాహవాచన జరిపించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం దేవస్థానం అర్చకులు పొడిచేటి రామభద్రాచార్యులు, కలకోట పవన్‌కుమారాచార్యులు, లింగాల ప్రసాద్‌శర్మ, ఇతర అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల్లో ప్రత్యేక పూజలు



పాతచర్ల ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు

చర్ల, నవంబర్ 20 : కార్తీకమాసం సందర్భంగా మొదటి సోమవారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పాతచర్ల శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి, సాయిగిరిలో శ్రీ షిర్డిసాయి మందిరం, ఆయిల్‌బంక్ ఏరియాలోని శ్రీ అభయాంజనేయస్వామి, పాత చర్లలోని పురాతన సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి, కలివేరు, లింగాల, ఆర్ కొత్తగూడెం, శివలింగాపురం ఆలయాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. పాతచర్ల శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 3గంటల నుంచి అభిషేకాలు, పూజలు జరిగాయి. తెల్లవారుజామున కార్తీక దీపాలను వెలిగించిన మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంచారు.

### ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రంలో పూజలు

దుమ్ముగూడెం, నవంబర్ 20 : కార్తీక సోమవారం పురస్కరించుకొని నర్సాపురంలోని ఆలయంలో భక్తులు పెద్దఎత్తున స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు కార్తీక పూజలు నిర్వహించి దీపాలు వెలిగించారు. కార్తీకమాసంలో సోమవారానికి ప్రత్యేకత ఉండడంతో భక్తులు, మహిళలు పెద్దసంఖ్యలో ఆలయానికి చేరుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



జ్యోతిర్లింగ ద్వాదశ క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు